# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ ఈరోజు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు.
- ❖ అమరావతిలోని గ్రామ కంఠాలలో మౌలిక సదుపాయాలను 904 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తామని మంత్రి పి.నారాయణ తెలిపారు.
- ❖ రానున్న మూడేళ్లలో డోలీ రహిత గ్రామాలుగా గిరిజన ప్రాంతాలను తీర్చిదిద్దుతామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.
- ❖ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.
- ❖ వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి రానున్న 12 గంటల్లో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

==========================

ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ ఈరోజు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. ఈ రోజు ఉదయం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ను కలిసి రాష్ట్రంలో అభివృద్ధి పనుల పురోగతిని కేంద్ర మంత్రికి ఆయన వివరించారు. త్వరలో చేపట్టనున్న నూతన ప్రాజెక్టులకు సహకారం అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తన పర్యటనలో భాగంగా కేంద్రమంత్రులు జగత్ ప్రకాష్ నడ్డా, నితిన్ గడ్కరీలను కూడా నారా లోకేష్ కలిసి రాష్ట్ర అభివృద్ధికి తగిన సహకారం అందించాలని కోరారు.

==========================

అమరావతి రాజధానిలో గ్రామ కంఠాలలో మౌలిక సదుపాయాలను 904 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ రోజు రాష్ట్ర సచివాలయంలో సీఆర్డీఏ 51వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారని

మంత్రి పాత్రికేయులకు వెల్లడించారు. అమరావతి రాజధానిలో మార్చి 31 నాటికి నాలుగు వేల అధికారుల నివాస గృహాలను పూర్తి చేస్తున్నామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

==========================

రానున్న మూడేళ్లలో డోలీ రహిత గ్రామాలుగా గిరిజన ప్రాంతాలను తీర్చిదిద్దుతామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పాత్రికేయులతో మంత్రి ఈ రోజు మాట్లాడుతూ... తొలి ఏడాది బడ్జెట్ లో 7,500 కోట్ల రూపాయలను గిరిజన సంక్షేమానికి కేటాయించామని గుర్తు చేశారు. అందులో ఇప్పటికే 1,300 కోట్ల రూపాయలను ఖర్చు చేసి దాదాపు 60 నుంచి 70 శాతం గ్రామాలకు రహదారుల సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. రానున్న ముడేళ్లలో గిరిజన గ్రామాలన్నింటికీ రహదారుల అనుసంధానాన్ని చేసేందుకు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని నంద్యాల జిల్లా అధికారులకు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. వ్యవసాయంతో పాటు, ఉద్యానవన పంటల రైతులను కూడా అప్రమత్తం చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు నీట మునిగిన ప్రాంతాల్లో ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని క్షేత్రస్థాయి అధికారులను మంత్రి ఆదేశించారు.

==========================

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని  పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా జిల్లా నలుమూలలు నుండి వచ్చిన వినతులను కలెక్టర్ స్వీకరించారు.

విరామం

==========================

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో పాత్రికేయులతో మంత్రి ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్టులో కాఫర్ డామ్ కొట్టుకుపోయిందని వస్తున్న వార్తలు అవాస్తవం అని చెప్పారు. ఈ విషయంలో ప్రజలలోనూ, రైతులలోనూ అపోహలు సృష్టిస్తున్నారని అన్నారు. పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యామ్ పై వాహనాల రాకపోకల కోసం 9 మీటర్ల పొడవున మట్టి రోడ్డు నిర్మాణం చేశామని మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 31 సెకన్లు)

==========================

అనంతపురం జిల్లాలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి టి.కె.అనిల్ కుమార్ ఈ రోజు పర్యటించారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాల అమలు తీరును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయా పథకాల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. జిల్లాలోని రాప్తాడు, బుక్కరాయసముద్రం, నార్పల

మండలాల్లో పర్యటించారు. బుక్కరాయసముద్రం మండలంలో లక్ పత్ దీదీ పథకం లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అనేక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

=========================

తిరుపతి జిల్లా తలకోనలోని శ్రీ సిద్దేశ్వరస్వామి వారి ఆలయం పునర్నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీ.ఆర్. నాయుడు ఈరోజు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలకోన సిద్దేశ్వరస్వామివారి ఆలయం గొప్ప ప్రాశస్త్యం కలిగి ఉందన్నారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని 19 కోట్ల రూపాయల టీటీడీ నిధులతో పునర్నిర్మాణం చేస్తున్నామని తెలిపారు.

=========================

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమిని రవి నాయుడు చెప్పారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలోని తారకరామా స్టేడియంలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. దానిలో భాగంగానే జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు 29న నిర్వహించే నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలలో నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తామన్నారు.

=========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 80,597 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరకు 676 పాయింట్ల లాభంతో 81,273 వద్ద ముగిసింది. నిఫ్టీ 245 పాయింట్లు పెరిగి 24,876 వద్ద స్థిరపడింది.

=========================

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా పరిసర ప్రాంతాలలో కొనసాగుతోందని విశాఖపట్నంలోని తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదిలి, రానున్న 12 గంటల్లో వాయు గుండంగా మారుతుందని వాతావరణ కేంద్రం అధికారి జగన్నాథ్ కుమార్ తెలియజేస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

=========================

పార్వతీపురం మన్యం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, కావున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ కోరారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తూ.. అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో ఆయన ఈ రోజు సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాతావరణ శాఖ సూచనల మేరకు రేపు జిల్లాలో పలు చోట్ల భారీ వర్షాలు కురిస్తాయన్నారు. ప్రజలు సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

=========================
=========================